క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: చలమంగళం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ బాలాజీ శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కార్యాలయంలోని సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు కార్యాలయం నుంచి బయటకు వెళుతున్నప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. ఆరేళ్లలోపు వయస్సు ఉన్న బాలబాలికలకు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డులు అందజేసేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

అప్పడలా..ఇప్పడిలా..

–నెట్టిబండలో వృథాగా పోతున్న తాగునీరు



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

చౌడేపల్లె: ఐదు నెలల క్రితం దిగువపల్లె పంచాయతీ నెట్టిబండ ఎస్టీ కాలనీలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వారు పడుతున్న కష్టాలపై సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశాల మేరకు నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంకుకు పైప్‌లైన్ వేసి తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించారు. అప్పుడు అలా అయితే శనివారం నెట్టిబండలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛాంధ్ర పైలట్ ప్రాజెక్టుగా రాళ్లబూదుగూరు



ఆటోను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

శాంతిపురం: పల్లెలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి రూపకల్పన చేసిందని ఎంపీడీఓ ఏపీఆర్.కుమార్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా రాళ్లబూదుగూరు పంచాయతీ ఎంపికైందని పేర్కొన్నారు. శనివారం రాళ్లబూదుగూరు సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి స్వాతీలకు ఎలక్ట్రిక్ ఆటోను అందజేశారు. ఈ–ఆటోను వినియోగించి గ్రామాల నుంచి త్వరితగతిన చెత్తను తరలిస్తారని చెప్పారు. ఆటో నిర్వహణలోని సాధకబాధలను ఉన్నత అధికారులకు నివేదించి, తర్వాత విడతలో అన్ని పంచాయతీలకు ఆటోలను అందిస్తామని ఆయన తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

రూ.29 వేలు స్వాధీనం

పుంగనూరు: పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని, వారి వద్ద నుంచి రూ.29,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్రమణ తెలిపారు. సీఐ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శనివారం రాత్రి దాడులు చేశామని పేర్కొన్నారు. దాడుల్లో ఐదుగురిని పట్టుకుని రూ.29,200 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న బాంబ్‌స్క్వాడ్

చిత్తూరు కార్పొరేషన్: కశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్‌హాల్, బుకింగ్, రిజర్వేషన్, పార్సిల్ కౌంటర్లను పరిశీలించారు. రైల్వే, పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ లోని ప్రయాణికుల బ్యాగులు, ఇతర వస్తువుల ను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలన చేశామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ కుమార్, రైల్వే ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

వినూత్న ప్రచారం



టెడ్డీబేర్ దుస్తులతో హోంగార్డులు

చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలు ఉపయోగించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కోరారు. హెల్మెట్ వాడకంపై ప్రజల్ని చైతన్యం చేయడంలో భాగంగా శనివారం ట్రాఫిక్ హోంగార్డులు టెడ్డీబేర్ దుస్తులు ధరించి నగరంలోని పలు ప్రధాన కూడళ్లల్లో హెల్మెట్ ధరించిన వాహనదారులను ఆపి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

రైతు బేజార్

- అలంకారప్రాయంగా రైతు బజార్ దుకాణాలు
- గత నెలలో ప్రారంభించినా సాగని క్రయ, విక్రయాలు
- మొదలు కాని వ్యాపారాలు
- ఇప్పటికీ ప్లాట్‌ఫామ్‌పైనే దుకాణాల నిర్వహణ
- గేట్ నిర్వాహకుల దెబ్బతోనే జాప్యమా?



వ్యాపారాలు మొదలుకాని రైతుబజార్, ఖాళీగా స్టాళ్లు

పలమనేరు : పట్టణంలోని వారపుసంతలో మార్కెటింగ్‌శాఖ నిర్మించిన రైతుబజార్‌లో ఇంతవరకు ఓ దుకాణమైనా రాలేదు. దీంతో రూ.26లక్షలతో నిర్మించిన రైతుబజార్ షాపింగ్ గదులు నిరుపయోగంగా మారాయి. దీన్ని గత నెలలో స్థానిక ఎమ్మెల్యేతోపాటు అధికారులు ప్రారంభించారు. ఇందులో రైతులు, వ్యాపారులు, మహిళా సమాఖ్య వారు కూరగాయల షాపులు పెట్టుకోవచ్చునని సూచించారు. కానీ ఇక్కడ వ్యాపారాలు చేసేందుకు వ్యాపారులు, రైతులు ఏమాత్రం ముందుకు రావడంలేదు. తమకు రోడ్లపైనే వ్యాపారం బాగా సాగుతోందని కొంతమంది , తమకు రైతుబజార్‌లోని దుకాణాలకు అవకాశం ఇవ్వలేదని మరికొందరు చెబుతున్నారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులు రైతుబజార్‌లో వ్యాపారాలు సాగేలా చూసినా ఫలితం లేకుండాపోయింది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందాన తయారైంది ఇక్కడి రైతుబజార్ పరిస్థితి.

ప్లాట్‌ఫామ్‌లపై యాభైదాకా దుకాణాలు..

పట్టణంలోని వారపుసంత, మున్సిపల్ ఆఫీస్, గంగమ్మగుడి వీధి, చర్చి పక్కన, సూపర్‌బజార్ వద్ద దాదాపు 50 మంది దాకా చిరువ్యాపారులు ప్లాట్‌ఫామ్‌లో కూరగాయలను విక్రయిస్తున్నారు. వీరిందరికీ రైతుబజార్ వద్దకు పంపితే అక్కడ వ్యాపారాలు జరుగుతాయి. కానీ వారు వెళ్లడం లేదు. తమకు ప్లాట్‌ఫామ్ వ్యాపారమే బాగుందని వారు చెబుతున్నారు.

వారపుసంతకు మాత్రం జనం వెళుతున్నారు..

ఇప్పుడు రైతుబజార్‌ను కట్టినచోట వారపుసంత ప్రతి శుక్రవారం జరుగుతుంది. ఈసంతలో 300పైగా దుకాణాలు పెడుతుంటారు. పట్టణవాసులు వారానికోసారి సంతకు వచ్చి అవసరమైన కూరగాయలు, సరుకులను తీసుకొని వెళుతుంటారు. సంత కొస్తున్న జనం రైతుబజార్‌కు ఎందుకు రారనే ప్రశ్న అధికారులకు తలెత్తుతోంది.

వ్యాపారులకు గేట్ నిర్వాహకుల దెబ్బ...

మున్సిపాలిటీలోని ప్లాట్‌ఫామ్‌పై దుకాణాలు పెట్టుకున్న వాళ్ల నుంచి గేట్ వసూలు చేసే కాంట్రాక్టును కొందరు నిర్వాహకులు పొందారు. ఈ దుకాణాలు రైతుబజార్‌కు వెళితే వీటికి గేట్ కట్టే పనిలేదు. దీంతో దుకాణాలన్నీ అక్కడ వెళితే తమకు గేట్‌లేకుండా పోతుందని వారేమైనా దుకాణాలు రైతుబజార్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారా అనే అనుమానాలున్నాయి. ఏదేమైనా దీనిపై మున్సిపల్, మార్కెటింగ్ అధికారులు చొరవచూపి రైతుబజార్ నిరుపయోగం కాకుండా అక్కడ వ్యాపారాలను ప్రారంభించేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.



సాగుతున్న వారపుసంత



సూపర్‌బజార్ వద్ద ప్లాట్‌ఫామ్‌పై కూరగాయల దుకాణాలు

షాపులు ఇవ్వమంటే ఇవ్వరు...



రోడ్డుపై కూరగాయలు పెట్టుకుని ఇబ్బందులు పడుతున్నాం. తమలాంటి వారికి రైతుబజార్‌లో షాపులు ఇవ్వమంటే ఇవ్వరు. పెట్టేవాళ్లని పెట్టనివ్వరు, వాళ్లు షాపులు పెట్టించరు. కొత్తగా కట్టిన షాపులను చూసుకోవాల్సిందే. వాటిని వాడితేకదా వ్యాపారులు, రైతులకు మేలుగా ఉంటుంది.

రాణెమ్మ, దుకాణదారు, పలమనేరు

రైతులకైనా షాపులిస్తే మేలు..



పలమనేరు మార్కెట్‌కు నిత్యం వందలాది మంది రైతులు వారు పండించిన కూరగాయలను తెచ్చి అక్కడి వ్యాపారులకు కమీషన్ ఇచ్చి అమ్ముకోవాల్సి వస్తోంది. అదే రైతులే నేరుగా రైతుబజార్‌లో సరుకు అమ్ముకుంటే కమీషన్ మిగులుతుంది. తాజా కూరగాయలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. దీనిపై అధికారులు ఆలోచించాలి.

అమరనాథరెడ్డి, కంచిరెడ్డిపల్లి, రైతు

నోటీస్ బోర్డు

● 2న ఉపనయనాలు

పుంగనూరు: పట్టణంలోని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మే 2న బ్రాహ్మణులకు ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు సురేంద్రరావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నగరి వీధిలో గల వీడీఎస్ కల్యాణ మండపంలో ఉదయం 7 గంటలకు సామూహిక ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ పిల్లలు ఉపనయనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

● 30న ఎద్దుల పరుష వేలం

పుంగనూరు: పట్టణంలోని శ్రీమాణిక్యవరదరాజ స్వామి రథోత్సవ ఎద్దుల పరుష వేలంను ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు దేవదాయ సహాయ కమిషనర్ ఏకాంబరం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పరుష వేలం పాటను ఉదయం 10 గంటలకు ఆలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటదారులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి, వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. పాట ముగిసిన వెంటనే వేలందారు డబ్బులు పూర్తిగా చెల్లించి, రశీదు పొందాలని చెప్పారు.

● ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

సదుం: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరుపతి వేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు.

ఉత్సాహంగా ఖవ్వాలి పోటీలు



విద్యుద్దీపాలతో నూర్‌షావలి దర్గా వెలుగులు

పుంగనూరు: స్థానిక పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన హజరత్ సయ్యద్‌నూర్‌షావలిబాబా ఉరుసులో భాగంగా రెండవ రోజు శనివారం ఖవ్వాలి ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ చేశారు. ఆదివారం ఖవ్వాలి, 28న తహలీల్ ఫాతేహా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించి దర్గాలో ప్రత్యేక పూలు చాదర్‌లు పెట్టి ముస్లిం పెద్దలు పూజలు చేశారు. ఎస్ఎస్.పేటలోని కళాశాల మైదానంలో దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. ఉరుసుకు భారీ ఎత్తున ముస్లింలు, హిందువులు తరలివచ్చారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్యం, వైద్యసేవలను పర్యవేక్షించారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు లోకేష్, కేవీ రమణ, సిబ్బంది కలిసి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉరుసులో దుకాణాలు

అంతా కనకదుర్గమ్మ దయ!

- కోట్లల్లో టోపీ పెట్టిన కనకదుర్గ గోల్డ్‌లోన్స్
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు
- అక్కడి సిబ్బంది ఖాతాల్లో భారీగా లావాదేవీలు
- పలమనేరులో ప్రకంపనలు సృష్టిస్తున్న బురిడీ బ్యాంకు కేసు



పలమనేరులోని కనకదుర్గ గోల్డ్‌లోన్స్ బ్రాంచ్

పలమనేరు: జిల్లాలో జనాన్ని ఏమార్చే బురిడీ గోల్డ్ బ్యాంకులు ఈమధ్య కాలంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కష్టాల్లో ఉన్నవారే వీరి టార్గెట్. ప్రభుత్వ బ్యాంకుల్లో గ్రాము బంగారు ధర కంటే ఎక్కువగా డబ్బులిస్తారని ఆశపడే జనం బంగారాన్ని ఇలాంటి ప్రైవేటు బ్యాంకుల్లో తనఖాపెట్టి మోసపోతున్నారు. ఇటీవల పుంగనూరు, పలమనేరు బ్రాంచుల్లో కనకదుర్గ గోల్డ్‌లోన్ పేరిట గ్రాముకు ఎక్కువ ధర రుణాలిస్తామంటూ రూ.8 కోట్ల దాకా అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పలమనేరు పోలీసులు రెండ్రోజుల క్రితం ఇందులో కీలక సూత్రధారి ఇక్కడి బ్రాంచ్‌కు చెందిన నరసింహులును కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. అతనిచ్చిన సమాచారంతో బ్రాంచ్‌లో పనిచేసే మరో ఎనిమిది మంది హస్తం ఉందని పోలీసులు విచారిస్తున్నారు. వీరంతా స్థానికులే కావడం, ఈ కుంభకోణంలో ఇంకెంతమంది ఉన్నారో అనే టెన్షన్ తప్పడం లేదు. మొత్తం మీద ఆ కనకదుర్గమ్మ దయతో తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు బంగారు తనఖా బ్యాంకులు...

ఎక్కడో హెడ్ ఆఫీస్ నుంచి స్థానికంగా బంగారు రుణాలను తాకట్టు పెట్టుకొనే ప్రైవేటు బ్యాంకులు జిల్లాలో యాభైదాకా ఉన్నట్టు తెలుస్తోంది. పెద్దగా జనసంచారం లేని చోట బ్రాంచులు వెలుస్తున్నాయి. గతంలో ఏదేనీ ప్రైవేటు బ్యాంకులో పనిచేసిన సిబ్బందిని వీరు అందులో ఉద్యోగాలిచ్చి వారి ద్వారా మొత్తం లావాదేవీలను నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

ప్రధాన నిందితుడు బొమ్మిదొడ్డి వాసి..

ఈ కేసులో ప్రధాన నిందితుడు బొమ్మిదొడ్డి వాసి కాగా సిబ్బందిగా పట్టణం, చిన్నూరు, బజారువీధి స్థానికులు సిబ్బందిగా బ్రాంచ్‌లో ఉంచుకున్నారు. వీరి సొంత ఖాతాల్లోకి సైతం లక్షల్లో లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. మొత్తం మీద బ్రాంచ్ మేనేజర్ చెప్పినట్టు కింది సిబ్బంది చేయడంతో ఈ కేసులో వారు ఇరుక్కోవాల్సి వచ్చింది. కీలక నిందితుడిచ్చిన సమాచారంతో ఇప్పటిదాకా ఎనిమిదిమంది సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు విచారణలో ప్రైవేటు వ్యక్తులు ప్రమేయం ఉందనే మాట వినిపిస్తోంది. దీంతో ఎవరెవరు ఇందులో ఇరుక్కుంటారోననే భయం కొందరికి పట్టుకుంది.

అక్రమాలు ఇంటి దొంగల పనే....

ఇలాంటి మోసాలకు పాల్పడే బంగారు తనఖా బ్యాంకుల్లో మేనేజర్, సిబ్బందితోపాటు గోల్డ్ అప్రైజర్ సైతం ఓ ముఠాగా ఉన్నట్టు పుంగనూరు ఘటనలో వెలుగుచూసింది. ఈ బ్యాంకులోని సిబ్బంది తమ బంధువుల ద్వారా భారీగా నకిలీ బంగారాన్ని వీటిలో తనఖా పెట్టించి కోట్లలో కొట్టేసినట్టు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే ఇదే తరహాలో పలమనేరులోనూ జరిగింది. బ్యాంకులోని సిబ్బందే సూత్రధారులు, పాత్రదారులుగా ఉన్న విషయం తాజాగా బయటపడింది. మొత్తం మీద ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ జరిగాక మొత్తం వ్యవహారం బయటపడనుంది.

పాడి పంటను కాపాడుకోవాలి



రైతును సన్మానిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు పాడి పంటను కాపాడుకోవాలంటూ, ఆర్థికావృద్ధికి బాటలు వేసుకోవాలని ఏపీఎల్‌డీఏ శ్రీనివాసరావు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శనివారం వరల్డ్ వెటర్నరీ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత శాఖ అధికారులు, సిబ్బంది పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులు మానవ జీవితంలో భాగమేనన్నారు. పశువుల వల్ల ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అలాంటి సంపదను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. ముఖ్యంగా వాటి ఆరోగ్య విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధికారులు సీజనల్ వారీగా పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పశువైద్య సేవలను మెరుగ్గా అందించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం పశు సంతతి పరిశీలన పథక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మునిరాజమ్మ, గోవిందస్వామి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రైతులు ఆర్ముగం, హరి, వెంకటరెడ్డిని ఈసందర్భంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఆరిఫ్, పశుసంతతి పరిశీలన పథక డీడీ వాసు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై కొవ్వొత్తులతో నిరసన





కొలమాసనపల్లిలో మానవహారం, కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పలమనేరు: కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని మండలంలోని కొలమాసనపల్లి గ్రామస్తులు శనివారం సాయంత్రం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. కులమతాలకతీతంగా గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలో స్థానిక శ్రీవారిసేవకులు పట్టణవాసులతో కలిసి ఉగ్రదాడిపై నిరసన తెలిపారు.

పంట..గిట్టుబాటులేక తంటా!

- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని నేతలు



గంగినాయనపల్లె వద్ద ధరలు లేక పొలాల్లోనే వదిలేసిన మస్కిమిలాన్

బైరెడ్డిపల్లె: వర్షాలు లేక అరకొర నీటితో సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అన్నదాతకు దిక్కులేకుండా పోతోందని ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు అమాంతంగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఇప్పటివరకు ఎటువంటి సాయం అందలేదని వాపోతున్నారు. కూరగాయల పంటలకు కూడా ధరలు లేకపోవడంతో పొలాల్లోనే వదిలిపెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కొంతమంది రైతులకు కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు కూలి ధరలు పెరగడం, మార్కెట్‌కు తరలించాలంటే లగేజీ చార్జీలు పెరగడంతో మరింత భారంగా మారింది. రెండు నెలలుగా టమాట ధర 15 కేజీలు రూ.70నుంచి 100 పలుకుతుండడంతో కూలీలకు చాలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోస, చిక్కుడు, బీన్స్, వంకాయ వంటి పంటలకు కూడా గిట్టుబాటు ధరలు లేవని అన్నదాతలు విలపిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు ధరలు లేకపోవడంతో అప్పులు పాలవుతున్నామని, ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

రూ.7 లక్షలు ఖర్చు పెట్టా..



మా గ్రామం వద్ద 5 ఎకరాలు కౌలుకు భూమి తీసుకుని మస్కిమిలాన్ సాగు చేశా. మండుతున్న ఎండలకు ధరలు పెరుగుతాయని ఆశించా. ప్రస్తుతం రూ.5 కూడా పలకడం లేదు. కోత దశలో ఉన్న పంటను నూర్పిడి చేసుకునేందుకు దిక్కుతోచడం లేదు. పంట సాగుకు అయ్యే ఖర్చు కూడా రాకపోతే మరో పంట సాగు చేసేది ఎట్టా. ఖర్చులు పెరిగాయి. ఆదాయం పెరగకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది.

–శ్రీనివాసులు, గంగినాయనపల్లె, రైతు

తీవ్రంగా నష్టపోయాం..



రెండు ఎకరాల్లో టమాట పంట సాగు చేశా. ధరలు బాగా వస్తాయని లక్షకుపైగా ఖర్చు పెట్టా. నెల రోజులుగా టమాటాను మార్కెట్‌కు తరలిస్తున్నా కూలీలకు, ఆటోలకు సరిపోవడం లేదు. కనీసం బాక్స్ ధర రూ.200పైగా ఉన్నా ఖర్చులుపోను గిట్టుబాటు అవుతుంది. ఈ ధరలతో నష్టాలు తప్పవు. రైతుకు మిగిలేది ఏమీ ఉండదు.

చంద్రప్పగౌడు, టీఎస్ కుప్పం, రైతు

నేడు బాలల యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఈ నెల 27వ తేదీ నుంచి బాలల సిద్ధ సమాధి యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 7 నుంచి 14 ఏళ్లలోపు బాల,బాలికలు శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ శిక్షణ ఈ నెల 27 నుంచి వరుసగా పది రోజులు కొనసాగుతాయన్నారు. అలాగే ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు 14 ఏళ్ల వయసు పైబడిన వారికి శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణ 14 రోజుల పాటు నిర్వహిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 82476 09140, 70138 84371 నంబర్లను సంప్రదించాలని కోరారు.